# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-05-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1) ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్న టీడీపీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

**2) లేపాక్షి దుకాణాలలో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగుల మూల వేతనాలను పది శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించిన మంత్రి ఎస్.సవిత.**

**3) వచ్చే నెల 1వ తేదీ నుంచి 12వ తేదీ వరకు అగ్నిపథ్ ఆన్‌లైన్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించిన ఆర్మీ నియామక అధికారి.**

**4) ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి.**

==========================

ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని టీడీపీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని తెలుగు దేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మహానాడు కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఈ రోజు పాల్గొని ప్రసంగించారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చేలా కార్యాచరణ చేపట్టామన్నారు. స్త్రీ శక్తి ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని, దీపం 2.0 ద్వారా ఏడాదికి మూడు ఉచిత సిలెండర్లు ఇస్తున్నామని తెలియజేస్తూ..

వాయిస్ ..25..సెకన్లు

--------------------------

రాష్ట్రంలోని లేపాక్షి దుకాణాలలో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగుల మూల వేతనాలపై పది శాతానికి పైగా జీతాలు పెంచుతున్నట్లు చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ప్రకటించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో మంత్రి కలిసిన లేపాక్షి ఉద్యోగులు తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత రెండేళ్లుగా అమ్మకాలు పెరిగిన నేపథ్యంలో ఉద్యోగులకు ప్రోత్సాహకంగా జీతాల పెంపు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 80 కోట్ల రూపాయల అమ్మకాల లక్ష్యంతో పనిచేయాలని ఉద్యోగులకు సూచించారు.

-----------------------------

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన డీఎస్సీ-2025 నియామక ప్రక్రియపై అసత్య ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పాఠశాల విద్యాశాఖ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 15 వేల 941 ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీని పూర్తి పారదర్శకంగా, చట్టబద్ధమైన నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేసినట్లు విద్యాశాఖ వెల్లడించింది. ప్రశ్నాపత్రాల లీకేజీ జరిగిందని వస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని తెలిపింది. ఇటువంటి అసత్య ప్రచారాల పట్ల అభ్యర్థులు ఆందోళన చెందవద్దని అధికారులు సూచించారు.

-----------------------------

ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ గత 12 సంవత్సరాల్లో ప్రజాహిత పరిపాలన, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలు తమ జీవన ప్రమాణాలను మెరుగుపరిచాయని, ఈ పథకాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకున్నామని శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన లబ్ధిదారులు తెలిపారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన వల్ల ఇంటికి ఉచిత గ్యాస్ కనెక్షన్ లభించిందని దీంతో కట్టెల పొగ సమస్య తగ్గిందని పుట్టపర్తికి చెందిన లబ్ధిదారుడు చంద్రశేఖర్ తెలుపుతూ...

వాయిస్ ..30.. సెకన్లు

అలాగే పీఎం కిసాన్ పథకం రైతులకు ఆర్థికంగా మేలు చేసిందని లబ్ధిపొందిన రైతు సతీష్ బాబు పేర్కొంటూ...

వాయిస్ ..30.. సెకన్లు

-----------------------------

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించేందుకు అవసరమైన అంచనాలపై ప్రత్యేక కమిషన్ సమగ్ర అధ్యయనం చేపట్టిందని కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా తెలిపారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో జిల్లా పరిషత్, మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన నిన్న మాట్లాడుతూ, గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో బీసీ జనాభా శాతం, రిజర్వేషన్ పరిమితులపై సమగ్ర సమాచారం సేకరిస్తున్నట్లు చెప్పారు. రాజ్యాంగ నిబంధనలు, సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారమే ఈ ప్రక్రియ కొనసాగుతోందన్నారు అనంతరం ప్రజలు, సంఘాల ప్రతినిధుల నుంచి కమిషన్ చైర్మన్ వినతులు స్వీకరించి వారి అభిప్రాయాలు నమోదు చేసుకున్నారు.

-----------------------------

అగ్నిపథ్ కింద భారత సైన్యంలో చేరేందుకు నిర్వహించే ఆన్‌లైన్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష -సి.ఇ.ఇ ను వచ్చే నెల 1వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గుంటూరు ఆర్మీ నియామక అధికారి కల్నల్ రజత్ సువర్ణ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని అనంతపురం, గుంటూరు, వైయస్సార్ కడప, కర్నూలు, నంద్యాల, శ్రీపొట్టి శ్రీరాములునెల్లూరు, ప్రకాశం, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, కాకినాడ, తూర్పుగోదావరి, ఎన్టీఆర్ జిల్లాల్లోని కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డులను www.joinindianarmy.nic.in ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ ఆన్‌లైన్ పరీక్షను

తెలుగు, హిందీ, ఆంగ్లంతో పాటు మొత్తం 13 భాషల్లో రాసే అవకాశం కల్పించినట్లు వెల్లడించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 134వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు లేదా మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈ నెల 29వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విమర్శంచారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీకి చెందిన పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు, ఇతర నాయకులతో ఈరోజు విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర బడ్జెట్‌లోనూ సంక్షేమ పథకాలకు సరైన నిధుల కేటాయింపు జరగలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై వచ్చే నెల 12వ తేదీన నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

---------------------------

ఎన్టీఆర్ జిల్లాలో జన గణన ప్రక్రియనుఎటువంటి లోపాలు లేకుండా పకడ్బందీగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ లక్ష్మీ శ తెలిపారు. విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో ఆయన ఈరోజు మాట్లాడుతూ, జనగణన కార్యక్రమాన్ని నెలాఖరులోపు వంద శాతం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఎటువంటి వ్యత్యాసాలు లేకుండా కచ్చితత్వంతో సమాచార నమోదు జరుగుతోందని వెల్లడించారు. జనగణన ద్వారా ప్రభుత్వ ప్రణాళికలు, సంక్షేమ కార్యక్రమాల అమలుకు అవసరమైన కీలక సమాచారం సిద్ధమవుతుందని కలెక్టర్ పేర్కొంటూ,

వాయిస్ ..25.. సెకన్లు

---------------------------

నవయుగ వైతాళికుడు, సంఘసంస్కర్త, బహు గ్రంథకర్త... కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతి ఈరోజు. వితంతు పునర్వివాహం, బాల్య వివాహాల నిర్మూలన కోసం కృషిచేసిన వీరేశలింగం పంతులు ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో హితకారిణి సమాజం స్థాపించి మహిళల అభ్యున్నతికోసం పాటుపడ్డారు. సమాజహితం కోసం తన జీవితాంతం పోరాడిన కందుకూరు వీరేశలింగం 1919, మే 27న మద్రాసులో తుది శ్వాస విడిచారు.

---------------------------

ప్రతి ఒక్కరూ రహదారి నియమాలను తప్పనిసరిగా పాటించి ప్రమాదాలను నివారించాలని తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సూచించారు. తిరుపతి పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుబ్బరాయుడుతో కలిసి ట్రాఫిక్ పోలీసులకు రోడ్డు భద్రతా కిట్లను ఈరోజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత ఏడాది రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రమాదాల సంఖ్య తగ్గిందన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు.

-------------------------

పార్వతీపురం మండలంలో జనగణన ప్రక్రియ అమలు తీరుపై కేంద్ర గణన ఉన్నతాధికారుల బృందం నిన్న క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఈ సందర్భంగా గ్రామ స్థాయిలో సేకరించిన సమాచారం, జనాభా అంచనాలు, మౌలిక సదుపాయాల నమోదును అధికారులు సమీక్షించారు. అనంతరం జిల్లాలోని ఎం.ఆర్. నగరం, గంగాపురం, కోరి గ్రామం ప్రాంతాల్లో పర్యటించి, జనగణన కోసం రూపొందించిన మ్యాప్‌ల పనితీరును పరిశీలించారు. జనగణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు కేంద్ర బృందం అధికారులకు అందజేసింది.

======================